# శ్రీ యనమల రామకృష్ణుడు

శ్రీ యనమల రామకృష్ణుడు పదవ శాసనసభ (1994-1999) స్పీకరుగా 1995వ సంవత్సరం జనవరి 12వ తేదీన ఏకగ్రీవంగా ఎన్నికై 1999వ సంవత్సరం అక్టోబర్ 10వ తేదీ వరకు ఆ పదవిని నిర్వహించారు.

వీరు శ్రీ అప్పారావు, శ్రీమతి సరస్వతి దంపతులకు 1951వ సంవత్సరము మే 12వ తేదీ తూర్పు గోదావరి జిల్లా ఎ.వి. నగరం గ్రామంలో జన్మించారు. రాజమండ్రిలోని గవర్నమెంట్ కాలేజీ నుండి పట్టభద్రులైన తరువాత మధ్యప్రదేశ్‌లోని సాగర్ యూనివర్సిటీ నుండి ఎల్.ఎల్.బి. డిగ్రీని పొంది కొంత కాలం న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసారు.

శ్రీ రామకృష్ణుడు 1983వ సంవత్సరములో ఏడవ శాసనసభకు, 1985వ సంవత్సరంలో ఎనిమిదవ శాసనసభకు, 1989వ సంవత్సరంలో తొమ్మిదవ శాసనసభకు, 1994వ సంవత్సరంలో పదవ శాసనసభకు, 1999వ సంవత్సరంలో పదకొండవ శాసనసభకు, 2004వ సంవత్సరంలో పన్నెండవ శాసనసభకు వరుసగా తుని నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

వీరు 09-1-1983 నుండి 16-08-1984 వరకు తిరిగి 16-09-1984 నుండి 22-11-1984 వరకు శ్రీ ఎన్.టి. రామారావు మంత్రి వర్గంలో పురపాలన, పట్టణాభివృద్ధి సంస్థలు, పట్టణ నీటి సరఫరా, న్యాయస్థానాలు, మురికివాడల నిర్మూలన, శాసనసభ వ్యవహారాలు, గృహనిర్మాణ మంత్రిగా పనిచేశారు. 1983-1984 సంవత్సరములో వీరు సదుపాయాల కమిటీకి అధ్యక్షులుగా ఉన్నారు. 1985వ సంవత్సరములో శ్రీ ఎన్.టి. రామారావు మంత్రి వర్గంలో 09-03-1985 నుండి 11-07-1987 వరకు సహకార శాఖ మంత్రిగా పనిచేసారు. 1989-1990 మధ్యకాలంలో ప్రభుత్వ సంస్థల కమిటీకి అధ్యక్షులుగా, 1991-1992 మధ్యకాలంలో ప్రభుత్వ లెక్కల కమిటీకి అధ్యక్షులుగా పనిచేసి ప్రభుత్వానికి నిర్మాణాత్మకమైన సిఫారసులతో కూడిన నివేదికలను శాసనసభకు సమర్పించడం జరిగింది.

వీరు స్పీకరుగా ఉన్న సమయంలో దేశం మొత్తం మీద మన రాష్ట్రంలో మొదటి సారిగా నైతిక విలువల కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. అదే విధంగా ఈయన హయాంలోనే శాసనసభ్యులు ప్రతి సంవత్సరం తమ ఆస్తుల వివరాలను స్పీకరుకు అందచేయాలనే నియమాన్ని రూపొందించారు. అలాగే వీరి హయాంలో శాసనసభ కార్యకలాపాలను టీవీలలో ప్రత్యక్ష ప్రసారం చేయడం ప్రారంభమైనది. వీరి హయాంలోనే మొదటి సారిగా అల్ప సంఖ్యాక వర్గముల సంక్షేమ కమిటిని ఏర్పాటు చేశారు.

శాసనసభ కమిటీల పనితీరును మెరుగుపరచడానికి ఆయన విశేషంగా కృషి చేశారు. శాసనసభా కమిటీలు చేసిన సిఫారసులను సాధారణంగా అమలు పరచవలసిందేనని, అయితే కొన్ని సందర్భాలలో ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరించాల్సి వచ్చినప్పుడు అలా ఎందుకు వ్యవహరించవలసి వచ్చిందో శాసనసభకు తెలియజేయవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉంటుందని నొక్కి వక్కాణించారు. శాసనసభకు ప్రాతినిధ్యం వహించే శాసనసభ కమిటీల నివేదికలపై తీసుకున్న చర్యల నివేదికను ప్రభుత్వం ఆ కమిటీ నివేదికను పంపిన తరువాత ఆరు నెలలలోగా శాసనసభకు సమర్పించవలసి ఉంటుందని 1998, ఏప్రిల్ 28వ తేదీన ఇచ్చిన రూలింగులో శ్రీ రామకృష్ణుడు స్పష్టం చేశారు.

వీరు స్పీకరుగా అనేక సదస్సులలో పాల్గొన్నారు. అమెరికా, కెనడా, యు.కె., ఫ్రాన్సు, బ్రెజిల్, చైనా, జపాన్, సింగపూర్, మారిషస్, ఇజ్రాయిల్, యునైటెడ్ ఆరబ్ ఎమిరైట్స్ మొదలైన దేశాలలో పర్యటించి ప్రజాస్వామ్య వ్యవస్థల పనితీరును అధ్యయనం చేశారు.

1999వ సంవత్సరములో శాసనసభ్యునిగా ఎన్నికైన తరువాత శ్రీ చంద్రబాబు నాయుడు మంత్రి వర్గంలో 11-10-1999 నుండి 14-05-2004 వరకు ఆర్థిక, ప్రణాళిక, చిన్న మొత్తాల పొదుపు, లాటరీలు మరియు శాసనసభ వ్యవహారాల మంత్రిగా సమర్థవంతంగా పనిచేశారు.

2004 సంవత్సరములో 12వ శాసనసభ సభ్యుడైన శ్రీ రామకృష్ణుడు ప్రభుత్వ లెక్కల కమిటీకి అధ్యక్షునిగా వ్యవహరిస్తున్నారు.

# శ్రీ రామకృష్ణుడు స్పీకరుగా ఎన్నికైన సందర్భంగా చేసిన ప్రసంగం

సభానాయకులు, గౌరవ ముఖ్యమంత్రిగారు, వివిధ పార్టీలకు చెందిన ప్రతిపక్ష నాయకులు, మంత్రులు, గౌరవ శాసనసభ్యులు ఈ 10వ శాసనసభకు నన్ను ఏకగ్రీవంగా అధ్యక్షునిగా ఈ గౌరవం కలిగించినందుకు నా హృదయ పూర్వక కృతజ్ఞతలు. సభ్యులంతా నా గురించి వెలిబుచ్చిన అభిప్రాయాలకు వారికి నా అభివందనాలు. ఈ సభను హుందాగా నడపడానికి, గౌరవ ప్రతిష్టలను యినుమడింపజేయడానికి, సత్‌సంప్రదాయాలను నెలకొల్పడానికి నేను శక్తివంచన లేకుండా కృషి సలుపగలనని మనవిచేస్తున్నాను. ఈ సభ నిర్వహణలో మనం అనేక సమస్యలను ఎదుర్కోవలసి వుంటుంది. వాటన్నింటినీ ప్రజా సంక్షేమ దృష్టితో, ప్రజాస్వామ్య పద్ధతిలో మనం పరిష్కరించుకోవాలే తప్ప మైకులు లాక్కోవడం, బల్లలు విరగ్గొట్టడం వంటి చర్యలకు పూనుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధం. ఒకరిపై ఒకరు నిందలు వేసుకోవడం, సభకు అంతరాయం కలిగే విధంగా నడచుకోవడం సభకు గౌరవం కాదు. సమస్యకు తన మేధస్సుతో స్పందించాలే తప్ప భుజబలంతో కాదు. శాసనసభలో మనకు గల సమస్యలను దృష్టిలో వుంచుకుని, కాలాన్ని సద్వినియోగపరచుకోవాలి. This House is for the debate on public issues but not for confrontation. ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుని ప్రజాప్రతినిధులుగా మిమ్ములను యిక్కడకు పంపడం జరుగుతోంది. వారి ఆశలకు, ఆశయాలకు అనుగుణంగా సభా కార్యక్రమాలు నడుపుకోవడం మనందరి బాధ్యత. ఈ సభా కార్యక్రమాలు ప్రజలకు తెలియజేయడంలో పత్రికలు ప్రముఖపాత్ర వహించవలసివుంటుంది. కనుక పత్రికా ప్రతినిధులు అందరూ వారి బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తారని ఆశిస్తాను. ఈ సభను గౌరవ ప్రదంగా నడపడానికి మీ అందరి సహకారాన్ని కోరుతున్నాను. ఈ 10వ శాసనసభ పనితీరు యితరులకు మార్గదర్శకంగా వుండేలా సభను నడిపేలా నాకు సహకరిస్తారని ఆశిస్తాను. ఈ 10వ శాసనసభలో చాలామంది కొత్త వాళ్లు రావడమే కాకుండా నాలుగైదు పర్యాయాలు కూడా ఎన్నికైన వారు కూడా రావడం జరిగింది. చాలామంది మేధావులు, పెద్దవారు, బాగా చదువుకున్న వారు, విద్యావేత్తలు, అనుభవం వున్నటువంటి ప్రజానాయకులు ఈ సభలో అడుగుపెట్టడం జరిగింది. ఇంతకుముందు శాసనసభలో

జరిగిన తీరు మనకందరకూ తెలిసిన విషయమే. ఈనాడు ఆంధ్రప్రదేశ్ 10వ శాసనసభ యొక్క పనితీరును ప్రజలు గాని, పత్రికలు గాని, మరి మిగతా రాష్ట్రాలు గాని పరిశీలిస్తున్నాయి. అందుచేత ప్రతి శాసనసభ్యుడికి, అధికార పక్ష సభ్యులకు ప్రభుత్వంలో వున్న ప్రతినిధులకు, అదే విధంగా ప్రతిపక్ష సభ్యులకు, ఈ సందర్భంగా మనవిచేసేది లీడర్ ఆఫ్ ది హౌస్ మాట్లాడుతూ చెప్పినట్లు, మీరందరూ నాకు సహకరించవలసి వుంటుంది. ఈనాడు అందరం చిత్తశుద్ధితో సమాజంలో వుండే అసమానతలు తొలగిపోవడం కోసం, సమాజంలో అట్టడుగువర్గాలకు న్యాయం చేయడం కోసం శాసనసభకు వచ్చిన వాళ్లం. వారి సమస్యల విషయంలో యిక్కడ పార్టీల ప్రమేయం లేకుండా, వ్యక్తులతో ప్రమేయం లేకుండా, మతాలతో ప్రమేయం లేకుండా, కులాలతో ప్రమేయం లేకుండా అందరమూ కలిసి శాసనసభలో సరైన రీతిలో, సక్రమమైన రీతిలో వ్యక్తంచేసి, వాళ్ల యొక్క కష్టనష్టాలు తీర్చడం కోసం నాకు సహకరిస్తారని ఆశిస్తాను. మనము యిక్కడ ఈ 10వ శాసనసభలో ప్రజా సమస్యలపై ఏమి తీర్పు యిస్తామో అని ప్రజానీకం ఎదురుచూస్తూ వుంటారు. ఆ తీర్పును మనం సక్రమమైన పద్ధతిలో యిచ్చినట్లయితే అది అందరికీ క్రెడిట్ ఉంటుంది. అంతే తప్ప మనం ఏదో ఈ సభకు స్వంతపనులకోసం గాని, మరొక విధంగా గాని వచ్చి కాలాన్ని వృధా చేసినట్లయితే అది ప్రజాస్వామ్య వ్యవస్థకే ముప్పు తెచ్చినట్లవుతుంది. అందుచేత నేను పదే పదే ఈ సందర్భంగా మనవిచేసేది అందరూ నాకు అన్ని విధాలా సహకరిస్తారని, డిగ్నిటీని, డెకోరమ్‌ను, డీసెన్సీని, హుందాతనాన్ని కాపాడే విధంగా ప్రతి ఒక్కరూ ప్రవర్తిస్తారని ఆశిస్తున్నాను. అదే విధంగా ప్రతీసారీ రాజీనామా గురించి మాట్లాడారు. ఇది స్పీకర్సు కాన్ఫరెన్సులో అనేక సందర్భాలలో వచ్చిన మాట వాస్తవమే. అయితే What is the essence behind the resignation? ఆ తీర్మానాలలో చెప్పింది. ఏకగ్రీవంగా ఎన్నుకునేటట్లు, అతనికి పోటీ లేకుండా చేసినట్లయితే అనే క్లాజును పెట్టుకోవడం జరిగింది. దీని వెనుక స్పీకరుగా ఎన్నుకోబడిన వ్యక్తి వెంటనే పార్టీకి రాజీనామా చేయాలన్న ఉద్దేశ్యం వెనుక ఉన్న ప్రాధాన్యత నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నది. విద్యాసాగరరావుగారికి గాని, ఎవరికీ గాని సందేహం అక్కరలేదు. రాజీనామా చేసినా, చేయకపోయినా నేను నిష్పక్షపాతంగా ఈ హౌస్‌ను కండక్ట్ చేస్తానని మరొకసారి సభ్యులందరికీ హామీ యిస్తున్నాను. అదే విధంగా ముఖ్యమంత్రిగారు కూడా చెప్పారు ప్రభుత్వపరంగా

ఏ విధమైన ఆటంకాలు లేకుండా, ప్రజాస్వామ్యానికి ప్రత్యేక ప్రాముఖ్యం యివ్వడం జరుగుతుందని. ఏ విధమైన యిబ్బందులు లేకుండా అధికారపక్ష సభ్యులు కోఆపరేట్ చేయడం జరుగుతుందని, ప్రతిపక్ష సభ్యులు, మిగతా సభ్యులు కూడా చెప్పారు. చాలా సంతోషం. మీరిచ్చిన సలహాలకు చాలా కృతజ్ఞుడిని. మిత్రులందరూ చాలా సలహాలను ఇచ్చారు ఈ సలహాలు వారు ఇచ్చినందుకు చాలా కృతజ్ఞతలు. ఈ సలహాలను పరిగణనలోకి తీసుకొని వీలయినంతవరకు ఆచరించడానికి సభ్యులందరూ సహకరించాలి. ఆ విధంగా సహకరించినట్లయితే ఈ సభ అత్యున్నతమయిన సభ కావడమే కాకుండా ఆదర్శవంతమయిన సభ అవుతుంది. మిగిలిన వారు కూడా దీనిని ఒక చక్కని ఉదాహరణగా తీసుకొనే అవకాశం కలిగించాలని మీ అందరినీ కోరుతూ, నన్ను ఏకగ్రీవంగా శాసనసభాపతిగా ఎన్నుకున్నందుకు మరోసారి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను.